**కథ**

# సంస్కారం

– వలివేటి నాగచంద్రావతి

**"పో,** నువ్వెప్పుడూ ఇంతే. ఎప్పుడడిగినా ఏదో వంక చెబుతూనే ఉంటావ్. అదంతా నాకు తెలీదు- నాకా బెనారస్ లాంగ్‌టాప్ - మామూలుది కాదు - జరీ ఎంబ్రాయిడరీ చేసింది - కొనిపెడితేనే అక్క పెళ్ళికి వచ్చేది. లేదంటే రానేరాను. నీ ఇష్టం. అః" ఖరాఖండీగా చెప్పేసింది నా కూతురు సారిక.

ప్చ్... ఈ పిల్లలకి ఎలా చెబితే అర్థమవుతుందో నాకర్థంకావటంలేదు.

మా అక్క కూతురు సంపూర్ణ పెళ్ళి- ఈ నెలాఖర్న. ఆ పెళ్ళికి వెళ్ళే సన్నాహంలో భాగమే మా ఇంట్లో ఈ సంగ్రామం. ఇప్పుడా బెనారస్ డ్రెస్ తియ్యాలంటే మాటలా? ఈ ఒక్క ఖర్చే కాదుగా- మిగతావెన్నుంటయ్.

పొద్దున్న నలుగురికీ రానూపోనూ ఢిల్లీకి రిజర్వేషన్లనగానే ఆయన మొహం ఎంత ముడుచుకుపోయిందో. పోదా మరి? పేరుకి ఇంజినీరు. అయిదంకెల్లో శాలరీ. గొప్పగా చెప్పుకోటానికేగానీ కటింగులన్నీ పోతే చేతికొచ్చేదెంత? చేతికొచ్చీరాగానే చేతులు జాపే ఖర్చులెన్ని? రోజులేమో మండిపోతున్నాయి. ఎంత తూకంగా గడుపుకున్నా చివరి తారీకొచ్చేటప్పటికి హళ్ళికి హళ్ళి సున్నకి సున్న. పైసా మిగల్దు.

మధ్యమధ్యలో ఇలా బడ్జెట్ దాటిన ఖర్చొచ్చిందంటే దిక్కులు చూస్తూ తడుముకోటం తప్పదు. పైనుంచి ఏ అప్పో సప్పో తెచ్చి అది తీరేదాకా తలకిందులవటమూ తప్పదు.

హ్మ్... నాకిలాంటప్పుడే మా పేరెంట్స్ మీద కోపమొస్తూ ఉంటుంది. కాస్త ఆస్తి సంపాయించి మా మొహాన వేసిపోవచ్చుగా- ఇలా రెక్కలొక్కటే ఇచ్చి వదిలెయ్యకపోతే.

* * *

రాత్రి భోజనాల దగ్గర పొద్దుటి సీను కొనసాగింది.

"ఆ నాగరాజుని పదివేలడిగి అక్కౌంటులో వేశాను" అని జనాంతికంగా చెప్పి. "సంపూర్ణకి గిఫ్ట్ కొనాలన్నావుగా- రేపు షాపింగ్‌కి వెడతావా?" అని నన్నూ... "నెట్లో ఆ రిజర్వేషన్ల సంగతి చూడరా అబ్బాయ్" అని వంశీకీ ఏకబిగిన చెప్పేశారు శ్రీవారు.

"నేను రావట్లేదు"

మా సారిక మూతి బిగిస్తే అసలు బావుండదు. ఆ మాట లక్షసార్లు చెప్పాను. వినిపించుకోదు.

"అరె... అవునా, మరి ఒక్కదానివీ ఉండగలవా?" అంటున్నారు మావారు.

అప్పుడే దాని మాటలు నిజమే అన్నట్టు నిర్ధారణ చేసెయ్యటం... 'సరే' అని ఒప్పేసుకున్నట్టూ... ఆ తరవాత మాటలు మాట్లాడేయటం... హరి భగవంతుడా, ఈయన తరహాని అమాయకత్వం అనుకోవాలా, అయోమయం అనుకోవాలా!

"ఒక టికెట్ క్యాన్సిల్... బోల్డు డబ్బులు మిగులు" చెల్లెల్ని ఏడిపించటం వంశీకి గొప్ప హాబీ.

"నోర్ముయ్" వాణ్ణి కసిరి, "మీకోపట్టాన ఏదీ అర్థంకాదు. అది అలిగింది" అన్నాను విసుగ్గా.

"అదా సంగతీ... ఎందుకురా తల్లీ" ప్రేమగా అడిగారు సారికని.


అది చెప్పలేదు. నేను చెప్పాను.

"ఏమిటీ, ఒక్క డ్రెస్సు అయిదువేలే! వద్దురా తల్లీ- మళ్ళీ ఆ నాగరాజు దగ్గరకెళ్ళటం నావల్ల కాదు. ఇదివరకు కుట్టించుకున్నవి చాలానే ఉన్నాయ్‌గా... ఈసారికి అడ్జస్టయిపో. ఇంకోమాటు చూద్దాం. ఏం సరేనా, నా తల్లి బంగారం. మాట వింటుంది."

ఈయనింతే. మెత్తమెత్తగా బుజ్జగించేస్తూ నాలుగు మాటలు చెప్పేస్తే పిల్లలు కన్విన్స్ అయిపోతారనుకుంటారు. వెర్రిబాగులతనం కాకపోతే ఆ వెనకాల వాళ్ళు నన్నెంత నసపెడతారో ఈయనగారికేం తెలుసు.

* * *

మనకుగా మనం కామా పెట్టడమే కానీ ఇంటిపని తెమలటమంటూ ఉండదు. డైనింగ్‌టేబుల్ దగ్గర నిలబడి ఐరన్ చేసుకుంటున్నాను. తనవి ఇన్ని డ్రెస్సులు తీసుకొచ్చి దబీమని నా పక్కన పడేసింది సారిక. ఏదో ఆలోచనలో ఉన్నానేమో అదురుకున్నాను.



"ఇదిగో, తమరు నాకు గతంలో కొన్న చీనిచీనాంబరాలు. ఎంత వైభోగంగా వెలిగిపోతున్నాయో చూసుకో. రేపు పెళ్ళిలో అందరూ మంచిమంచి బట్టలు వేసుకుంటే నేనీ డొక్కు డ్రెస్సులతో తిరుగుతాను. అంతా నవ్వుకుంటారు. అది చూసి సంతోషిద్దువుగాని" అంది రుసరుసలాడుతూ.

నాకు ముందే తెలుసు- ఈరోజు నామీద యుద్ధ ప్రకటన జరుగుతుందని. దురదృష్టం... ఈరోజు దాని కాలేజీకేదో సెలవొచ్చింది కూడాను- సావకాశంగా కసి తీర్చుకోటానికి.

"చూడవేం?" ఒక్కోటీ విప్పదీసి మరీ ప్రదర్శనలాగా చూపిస్తూ మరోసారి హెచ్చరించింది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి- ఒకటి రెండు డ్రెస్సులు మినహా మిగతావన్నీ వాడిక ఎక్కువవటం మూలంగా మెరుగు తగ్గాయి. ఎప్పుడో హైస్కూలు మారి కాలేజీలో జాయినయినప్పుడు కుట్టించినవి. ఇప్పుడు సెకండియర్లోకొచ్చింది. పాతబడ్డాయంటే పడవ్వూ - మధ్యమధ్యలో పండక్కీ పబ్బానికీ కాస్త ఖరీదైన డ్రెస్సులే కుట్టించాను. అవన్నీ రోజూ వాడేయకుండా కాస్త వెనక్కి పెట్టుకోవే అంటాను. ఉహూఁ- నా మాటెప్పుడు వింది కనక.

"నన్నేం చేయమంటావ్. మీ నాన్నేం చెప్పారో విన్నావుగా. అర్థంచేసుకో. ఊహ తెలిసిన పిల్లవేగా. కిందటి నెల్లో పెదనాన్నగారింట్లో బారసాల. ఈనెల్లో ఈ పెళ్ళి... ఇలా ఖర్చు మీద ఖర్చు వస్తూంటే ఆయన మాత్రం ఎలా తట్టుకోగలరు చెప్పు" అన్నాను నచ్చచెప్పే ధోరణిలో.

విసురుగా కుర్చీలాగి కూర్చుంది సారిక. "అవును,

51

నా దగ్గరకొచ్చేటప్పటికే మీకు ఏకానమీ గుర్తొస్తుంటుంది. అదే అన్నయ్యనుకో- షూ అడిగితే చెప్పులు కూడా తోడొస్తాయి. అడగటమాలస్యం స్కూటర్లూ లాప్‌టాప్‌లూ దిగిపోతాయి" గయ్యిమంటూ ఉదాహరణలతో సహా మా వలపక్షాన్ని ఎత్తిచూపించింది మా అమ్మాయి.

హతాశురాలినయ్యాను. పలుకులొచ్చిన చిలకలు... ఏమనగలం?

"చివరికి అమ్మానాన్నక్కూడా పక్షపాతబుద్ధి అంటగడుతున్నావన్నమాట. భడవా, మరి నీకు గాజులూ గొలుసూ చేయించలా..? చూడూ, వాడి అవసరానికి తగ్గట్టు వాడికీ, నీ వయస్సుకు తగ్గవి నీకూ కొనిపెడుతూనే ఉన్నాం. పాకెట్‌మనీ కూడా ఆడపిల్లవీ అనుకోకుండా నీకూ సమానంగానే ఇస్తున్నామా? ఇంకేవిటే నీకు తక్కువ చేస్తున్నదీ" ఒళ్ళుమండి వాదనకి దిగాను అంతరం మర్చిపోయి.

ధుమధుమలాడుతున్న సారిక మొహంలో ఒక్కమాటుగా వెలుగొచ్చింది. "అమ్మా, ఒక ఐడియా. అన్న అకౌంటులో చాలా డబ్బుంది. నాకది ఇమ్మనవా... ప్లీజ్ ప్లీజ్..."

విస్తుబోయాన్నేను- దాని దురాలోచనకి. పాపం వంశీ క్రికెట్‌ప్రియుడు. చూడ్డం కాదు, ఆడతాడు కూడా. వాళ్ళ నాన్నని అడిగినా ప్రయోజనం ఉండదని ఎప్పట్నుంచో పాకెట్ మనీలో కొంచెం కొంచెం మిగిల్చి కూడేసుకుంటున్నాడు- మంచి క్రికెట్ కిట్ కొనుక్కోటానికి.

ఇదేమో ఎప్పటికప్పుడు బ్యూటీ పార్లర్లకీ, ఫ్యాన్సీ షాపుకీ తగలబెట్టేసి ఇప్పుడు వాడు దాచుకున్న అమౌంట్ మీద కూడా కన్నేస్తోం దన్నమాట... హన్నా.

"ఛప్, పాపం వాడో చీమలాగా ఒక్కో రూపాయీ ఎందుకు జమ చేసుకుంటున్నాడో నీకు తెలీదూ - ఏం మాట్లాడుతున్నావే నువ్వూ?"

"ఈ ఒక్కసారికే. అమ్మా అమ్మా - ఇమ్మని చెప్పవా... ప్లీజ్ ప్లీజ్" వేధించట మెలాగో మా సారిక దగ్గరే నేర్చుకోవాలి ఎవరైనా.

పాపం వంశీ చెల్లెల్ని సరదాగా ఏడిపి స్తాడుగానీ ఇదంటే వాడికి చాలా ప్రేమ. చెల్లెలికని అడగాలే కానీ 'ఇవ్వను' అని అననే అనడు. నాకు తెలుసు.

కానీ అడగను. క్రితంసారి కూడా తన పూర్ ఫ్రెండ్ కాలేజీ ఫీజు కట్టడానికి సహాయంగా అప్పటిదాకా తను పొదుపు చేసుకున్న మొత్తమంతా ఇచ్చేశాడు.

పిచ్చి సన్నాసి. తన ఎయిమ్ కోసం మళ్ళీ పోగుచేసుకోవటం మొదలుపెట్టాడు. ఇప్పుడీవిడగారి డ్రెస్ కోసం అది మళ్ళీ లాక్కోనా- ఊహూ.

ఐరన్ స్విచ్ ఆఫ్ చేసి దాని ఎదురుగా



కుర్చీ లాక్కుని కూర్చున్నాను. "చూడు అమ్మలూ, మా అమ్మ ఎప్పుడూ చెబుతూం డేది. ఒకరు సాగుచేసుకున్న పంటమీద నీ దిష్టికళ్ళు పడనీకూ అని. వాళ్ళు దానిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నారో... వాటిని పడగొట్టే హక్కు నీకు లేదు. అది చాలా తప్పు, పాపం - అని. అన్ననే చూడు... నాకు తెలిసి ఏడాది నుంచీ ఆ క్రికెట్ కిట్ కొనుక్కోవాలని కూడబెట్టుకుంటున్నాడు. తెలిసీ నీ కోరిక కోసం వాడి ఆశ మీద నీళ్ళు చల్లటం తప్పు కాదూ" అన్నాను బుద్ధులు చెప్పేటప్పుడుండాల్సిన గాంభీర్యం ధ్వనిస్తున్నట్టు పించేలా మొహం పెట్టి.

మాట్లాడలేదు సారిక. డల్ అయిపోయిన దాని మొహం చూస్తే జాలేసింది మళ్ళీ పసితనం. అది కావాలీ, ఇది కావాలీ అని కోరుకోటం అత్యంత సహజం.

"షాపింగుకి వెళ్తున్నాంగా. దానిలో ఏమన్నా మిగిలితే నీ డ్రెస్సు కూడా చూద్దాంలే. పైన కొద్దో గొప్పో వెయ్యాల్సివస్తే నా దగ్గరున్నది కలుపుతాను. సరేనా" అన్నాను సముదాయింపుగా.

★ ★ ★

షాపింగ్, అబ్బ... దానంత ఉత్సాహకర మైనదీ లేదు - దానంత చిరాకెత్తించేదీ మరొకటి లేదు. బజార్లలో రాసుకుపోయే జనాల మధ్య ఎక్కణ్ణుంచి ఎక్కడకు తేల తామో తెలీకుండా తిరగటం... కాళ్ళు లాగేస్తున్నాయ్ అనుకుంటూనే మరికాస్త తిరుగుదాం అనిపించే ఆకర్షణశక్తి దానిది.

సంపూర్ణకి లోలాకులు బంగారపువి తీసుకో వాలని సంకల్పం. దానికి నేనంటే చాలా ఇష్టం. అవయితే నేను రోజూ గుర్తొస్తుం టాను. కానీ జ్యూయలరీ షాపులో వాటి ధర చూస్తే కళ్ళు పచ్చబడ్డాయి. అతి తక్కువ బరువులో చూసినా పదివేలకి పైమాటే. 'ఇంకా తక్కువలో లేవా?' అనడిగితే, నావంక పిపీలికాన్ని చూసినట్టు చూశాడా సేల్స్‌మేన్- ఇంకొక కస్టమరుకి చూపించే పనిలోపడి పోతూ. దాదాపు పది షాపులు తిరిగుంటాం. అన్నిచోట్లా అదే పరిస్థితి.

నీరసంగా చివరి షాపులోంచి బయట కొచ్చాం. అనుకున్న పని కాకపోతే చాలా డిప్రెసింగ్‌గా ఉంటుంది నాకు. నాపక్కనే నడుస్తూ గిఫ్ట్‌గా ఇంకా ఏమేం కొనచ్చో లిస్టు చెప్పేస్తోంది మా అమ్మాయి- కొద్దిగా తన డ్రెస్సుకి మిగిలేలా బ్యాలెన్స్ చేస్తూ. ఏ ఒక్కటీ మనసుకి సరే అనిపించట్లేదు నాకు. ఆ లోలాకులే సరైన సెలెక్షన్. ఎలా గైనా సరే, అవి తీసుకుంటేనే బాగుంటుందని మరీమరీ అనిపిస్తోంది.

కానీ ఎలాగ? మళ్ళీ ఓసారి మా పెద్దలు తలపులోకొచ్చేరు.

"అమ్మా, గుడికెడదాం" అంటోంది సారిక.

ఆ పెద్దపెద్ద కాంప్లెక్సుల మధ్యలో రాజస్థానీ వ్యాపారులు కట్టించిన పాలరాతి కృష్ణమందిరం ఉంది. డబ్బు ఒలకబోసి కట్టించారేమో... గొప్పగానే కాక సుందరంగా, కళాత్మకంగా ఉంటుంది. ముఖ్యంగా అక్కడ ప్రసాదంగా పెట్టే స్వీటుంటుందే- నిజంగా అమృతం. పనిమీద ఇటువైపు వచ్చినప్పుడల్లా పుణ్యమూ పురుషార్థమూ అని కృష్ణ దర్శనం చేసుకుని ప్రసాదం కళ్ళకద్దుకుని 'ఆహాహా' అనుకుని రావటం అలవాటు.

కానీ, నాకివ్వాళ వెళ్ళే మూడ్ లేదు. ఆ మాట నేననేలోగానే నా కూతురు గుడి మెట్లెక్కేస్తోంది. నాకూ తప్పలా.

యాంత్రికంగా ప్రదక్షిణాలు పూర్తిచేసి దేవుడి ముందు నిలబడ్డాం. కళ్ళముందు చిరునవ్వులొలికించే రాధామాధవుడే ఉన్నా ధ్యాస మాత్రం ఇంకెటో! 'క్షమించు కృష్ణయ్యా, నీ ముందు కూడా అన్యమనస్కంగా ఉండటం తప్పే. ఏం చేయమంటావ్. నా సమస్య తెలుసుగా... దయ ఉంచి తరుణోపాయం చెబుదూ' లోలోపలే చెంప లేసుకుని వేడుకున్నాను. కష్టం రాగానే


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివింపగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-82.

దణ్ణం పెట్టి 'దేవుడా, నీ మహిమ' అనుకోవటం సర్వసామాన్య లక్షణం.

ప్రసాదం తీసుకున్న తరవాత "పద, అక్కడ కాసేపు కూర్చుందాం" అంది సారిక అలిసిపోయినట్టు.

గుడి ప్రాంగణంలోనే చుట్టూ గట్టుకట్టి పాలరాళ్ళు పరిచిన చిన్న కొలను- కృష్ణుడు గోపికలతో రాసక్రీడలాడుతోన్న శిల్పాలతో రమణీయంగా ఉంటుంది.

వెళ్ళి కూర్చున్నాం కొలను గట్టుమీద. సారిక నోటికెప్పుడోగానీ మూతపడదు. ఏవిటేవిటో చెబుతోంది. పరధ్యానంగా వింటున్నాను. చేతిలోని ప్రసాదం నోట్లో వేసుకుంటూ చిన్న చిదప కిందపడినట్టుంటే యథాలాపంగా కిందికి చూశాను.

కాళ్ళ దగ్గర ఏదో వస్తువు. ఏదో ఏమిటీ- జూకా. చెవులకు పెట్టుకునే జూకా. చేతిలోకి తీసుకున్నాను. పాత మోడలు. మెరుపొట్టే లేదు. పిచ్చిదయి ఉంటుంది. అనాలోచితంగా పక్కనే ఉన్న రాతికి రుద్దాను. పసిడి తళతళలాడింది.

ఒళ్ళు ఝల్లుమంది. గుండె వేగం అకస్మాత్తుగా ఊపందుకుంది. 'భగవాన్, నా మొర విని పరిష్కారమిలా చూపించావా తండ్రీ' మనసు ఉద్వేగంతో నిండిపోతోంది. 'జూకా బరువుగానే ఉంది. ఇది మారిస్తే సంపూర్ణకి తేలిగ్గా లోలాకులు వచ్చేస్తాయి. ఉన్న డబ్బుతో సారికకి డ్రెస్ కొనేయచ్చు.' అతి వేగంగా అంచనాలూ, నిర్ణయాలూ చేసేస్తోంది మెదడు.

మాటలాపి ఇటే చూస్తోంది సారిక. 'బంగారపుదేనా?" అంది సంశయంగా.

కాదు అని మభ్యపెట్టడం ఎందుకు? తలూపాను.

"పాపం, ఎవరు పోగొట్టుకున్నారో" సానుభూతిగా వాళ్ళకోసం అటూ ఇటూ కలయజూసింది సారిక.

నా పిడికిలి అప్రయత్నంగా బిగుసుకుంటోంది- ఆయాచితంగా లభించిన అదృష్టమేదో చేతివేళ్ళ సందుల్లోంచి జారిపోతున్నట్టు.

"అటువెళ్ళి అడుగుదామా ఎవరిదన్నానేమో" హడావుడిగా లేవబోయింది సారిక.

చెయ్యి పట్టుకుని ఆపాను. ఏమన్నట్టు చూసింది.

"పిచ్చిదానివా నువ్వు? ఇది గుడి. ఇప్పటికే వచ్చెళ్ళిపోయినవాళ్ళు బోలెడు మందుంటారు. వాళ్ళలో ఎవరిదన్నానేమో ఇది. ఇప్పుడెవర్నని వెళ్ళడగుతావ్? బంగారమంటే ఎవరికన్నా ఆశే. ఏదో కహానీ చెప్పి, మాదే అని ఎవరన్నా అంటే ఇచ్చేసొస్తానంటావా ఏం?" అన్నాను- ఆలోచించుదాం ఉండన్నట్టు.

"మరేం చేద్దాం?"

మాట్లాడలేదు నేను.

"ఓ పనిచేద్దాం. కాసేపిక్కడే కూర్చుందాం. పోగొట్టుకున్నవాళ్ళే వెతుక్కుంటూ ఇక్కడకు రావచ్చు. అప్పుడు సందేహించక్కర్లేదుగా. కాకుంటే మనక్కాస్త టైమ్ వేస్ట్, అంతే. ఏమంటావ్?" అంది మళ్ళీ తనే.

తలూపాను. కనబడ్డవాళ్ళ మొహాలు వెతుకుతూ ఎదురుచూపుల్తో సారికా, నిప్పుల మీద కూర్చున్నట్టు అసహనంగా నేనూ కూర్చున్నామక్కడ.

'రాకూడదు ఎవ్వర్రాకూడదు' కోరుకుంటోంది మనసు లోపల్లోపల.

'తప్పు తప్పు. అలా ఆలోచించటం తప్పు' అంటోంది ఆ మనసే రెండుగా విడిపోయి.

'దొంగిలించటమో, బలవంతానా లాక్కోవటమో కాదుగా... దొరికింది దైవప్రసాదం. తీసుకోవటంలో తప్పులేదు' అంటోంది మూడుగా విడిపోయి.

"పద, పోదాం" పావుగంట తరవాత అయిష్టంగా లేచింది సారిక.

హమ్మయ్య. లేచి గుడి బయటకొచ్చాం. గుడి దాటి పదడుగులు కూడా వేశాం.



ఇంకో పది, పదిహేనడుగులు... మెయిన్ రోడ్డు వచ్చేస్తుంది. ఆటో ఎక్కితే గండం గడిచినట్టే.

ఎదురుగా తొందర తొందరగా వస్తోందావిడ. పక్కనే ఓ ఏడెనిమిదేళ్ళ అమ్మాయి. ఎవరావిడా..? కిందికి చూసి వెతుకుతూ, వాళ్ళనీ వీళ్ళనీ ఏదో అడుగుతూ... పక్కనున్న ఆ పాప చెవులకు ఒకే ఒక జూకా వేలాడుతున్నట్టుందేం... 'హరి భగవాన్, భయపడ్డంతా అయిందా. ఇక సారిక దృష్టి మళ్ళించటం నావల్ల అవుతుందా?'

అవదు. అవలేదు. "అమ్మా, ఆ లోలాకు ఆ పాపదే అనుకుంటా- చూడూ- ఆ ఆంటీ అందర్నీ అడుగుతోందీ" అంటూనే ఆవిడ దగ్గరికి పరిగెత్తినట్టే వెళ్ళింది మా అమ్మాయి ఉత్సాహంగా.

నా కాళ్ళు మాత్రం కదలనని మొరాయించాయి. అయినా నేను కదలటమెందుకు- వాళ్ళే నా దగ్గరకొచ్చేశారు. ఊహూ, వెంటబెట్టుకుని మరీ వచ్చేసింది నా కూతురు.

చాలా ఆదుర్దాలో ఉన్నదావిడ. బిక్కమొహం పెట్టుకు నుంచున్నదా పాప. మా సారిక మొహమయితే వాళ్ళని కనిపెట్టేసిన ఆనందానిగ్గావును మతాబులా వెలిగిపోతోంది.

నేను నిర్లిప్తంగా హ్యాండ్‌బ్యాగ్ తెరిచి జూకా పైకి తీశాను. సందేహమే అక్కర్లేదు- ఆ అమ్మాయి పెట్టుకున్న జూకా జతే ఇది. వచ్చే నిట్టూర్పు అణచుకుని ఆవిడ చేతిలో పెట్టేశానది.

పరమానందపడిపోయిందావిడ. "రక్షించావమ్మా, ఎక్కడ అనవసరంగా నింద పడవలసి వస్తుందో అని ఎంత బెంగపడిపోతున్నానో. మీ పుణ్యమా అని తప్పించేరు" అంది కృతజ్ఞతలు కురిపిస్తూ.

'అవునవును. మీ బెంగ తీరిపోయింది. నాది మొదటికొచ్చింది.'

ఆవిడ- ఆ పాపా వాళ్ళింట్లో వంట చేస్తుందట. తనతో వచ్చినప్పుడే ఆ వస్తువు పోవటం మూలంగా అనుమానం, అపవాదూ తనమీదే పడి ఉండేవని ఆవిడ భయం.

స్థిమితపడిందిగా రిలీఫ్‌గా చెబుతోందావిడ. 'గంటక్రితం గుడికొచ్చి అక్కణ్ణుంచి మార్కెట్‌కి వెళ్ళారట. వచ్చేప్పుడుగానీ చూసుకోలా- చెవి జూకా లేదని. తిరిగిందంతా రద్దీలోనే. ఆశ వదిలేసుకునే, వచ్చిన దారంతా వెతుక్కుంటూ వెనక్కొస్తున్నాం' అంటూ.

రోడ్డుకి ఓ పక్క నుంచుని మాట్లాడుతున్నాం. మా చుట్టూ ఇద్దరు ముగ్గురు కూడుతున్నారు- ఏమిటన్నట్టు.

"వెడదాం" అన్నాను సారిక భుజం తట్టి.

వెనక్కి తిరగబోతూండగా నా చేయి తన చేతిలోకి తీసుకున్నదావిడ ఆప్యాయంగా.

"చాలా దొడ్డ మనసమ్మా మీది. ఇందాకనే చూశాను- అమ్ముకునే మనిషి గంపలోంచి పండొకటి జారిపడితే వెనకొస్తున్న ఆవిడెవరో చటుక్కున సంచిలో పడేసుకుంది- ఏం తెలీనట్టు. ఆ మాత్రం స్వార్థంలేని మనుషులు కనిపించట్లేదీ రోజుల్లో. అలాంటిది బంగారం దొరికితే గుట్టు చప్పుడు కాకుండా బ్యాగ్‌లో వేసుకుని అక్కణ్ణుంచి తప్పుకుపోకుండా 'సొంత వాళ్ళెవరా' అని వెతికావు. ఎదురొచ్చి చేతిలో పెట్టావు. ఈ సంస్కారం ఎంతమందికుంటుంది తల్లీ. నువ్వు చేసిన ఈ మేలు ఎప్పటికీ మరిచిపోనమ్మా" అంది ఎంతో ఆత్మీయంగా.

ఎక్కడో చివుక్కుమంది నాకు.

"భలేవారు ఆంటీ, మా అమ్మ సంగతి మీకు తెలీదు- బంగారం కాదు - ప్లాటినం పర్వతమైనా సరే, పరాయివాళ్ళదయితే కన్నెత్తి కూడా చూడకూడదన్నది మా అమ్మ నియమం. అంతెందుకూ, మీరు కనబడకపోతే ఈ జూకా ఏ పోలీస్‌స్టేషన్లోనో అప్పగించేసేది" సారిక పొగడ్తలు కొరడా చివర్లలా మనసుకి తాకి గిలగిల్లాడాను. ★